రైతుల కోసం ప్రభుత్వము ప్రత్యేక డ్రైవ్

విశాలాంధ్ర-నెల్లూరు టౌన్: పూర్తి కాజిడిన గ్రామాల్లో జాయింట్ పట్టాదారులుగా నమోదైన రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలైన అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం మొదలైన పథకాలను పొందడంలో ఎదురవుతున్న ఇబ్బందులు తొలగించుటకు గాను ప్రభుత్వము ప్రత్యేక సబ్ డివిజన్ డ్రైవ్ చేపట్టినట్లు జాయింట్ కలెక్టర్ కే కార్తీక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకుగాను రెవెన్యూ డిపార్ట్మెంట్ సబ్ డివిజన్ సేవకోసం నిర్ధారించిన 500 రుసుమునకు మినహాయింపు ఇచ్చి కేవలము నామమాత్రపు దరఖాస్తు రుసుము రూ.50 సంబంధిత గ్రామ సచివాలయముల్లో చెల్లించినచో, జాయింట్ పట్టాదారుల భూములను ఉచితముగా సబ్ డివిజన్ చేయనున్నట్లు జేసీ తెలిపారు. ఈనెల 30 తేదీల్లోగా అర్హులైన రైతులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జెసి పిలుపునిచ్చారు.

విశాలాంధ్ర



శ్రీ పొట్టిశ్రీరాములు

నెల్లూరు జిల్లా

శుక్రవారం 20 జూన్ 2025. 4 పేజీలు

జర్నలిస్ట్ పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో 50 శాతం రాయితీ కోరిన ఏపియూడబ్ల్యూజె

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు: నెల్లూరు జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు పాఠశాలలో 50 శాతం రాయితీ కల్పించాలని కోరుతూ నెల్లూరు జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ కు నెల్లూరు జిల్లా ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ నాయ కులు జిల్లా కలెక్టర్ కలిసి ఓ వినతి పత్రం సమర్పించడం జరిగింది. కార్యక్రమంలో అధ్యక్షుడు వి.వెంకటేశ్వర్లు, కార్యదర్శి మస్తాన్ రెడ్డి, ఉపాధ్యక్షులు దయాశంకర్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా కార్యదర్శి ఖజా, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్పందిస్తూ డీఈఓకి ఫోన్ ఫోన్ ద్వారా జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలలో 50 శాతం రాయితీ అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. జర్నలిస్టుల మిత్రులందరూ 50 శాతం రాయితీ కొరకు డీఈవోకి పిల్లల వివరాలు తెలియజేస్తే స్కూల్ యాజమాన్యంతో మాట్లాడి అమలు చేస్తారని తెలియజేశారు. అలాగే జిల్లా కలెక్టరుకు ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు మతల్లికార్జున ఆధ్వర్యంలో కూడా జిల్లా కలెక్టర్కు ఫీజు రాయితీపై వినతి పత్రాన్ని అందజేశారు.

యోగ దినోత్సవ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

- జిల్లాలో ఏడు వేల ప్రదేశాల్లో సామూహిక యోగా కార్యక్రమాలు
- జిల్లా కలెక్టర్ ఆనంద్

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు: అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిం చేందుకు జిల్లాలో అన్ని ఏర్పాట్లనుపక్కాగా చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ ఆనంద్ తెలిపారు. గురువారం మధ్యాహ్నం అమరావతి సచివాలయం నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జూన్ 21 శనివారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ కాన్ఫరెన్సుకు నెల్లూరు కలెక్టరేట్లోని ఎస్ఆర్ శంకరన్ వీసీ హాలు నుంచి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ కార్తీక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గ్రామ, వార్డుస్థాయి నుంచి మండలస్థాయి వరకు 7 వేల ప్రదేశాల్లో సామూహిక యోగా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడివోలు, తహశీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది అందరూ తమపరిధిలో ఏర్పాట్లను పూర్తి చేస్తున్నట్లు చెప్పారు. అన్ని ప్రదేశాల్లో యోగా ట్రైనర్స్, ఇన్చార్జిలను నియమించి కార్యక్రమాలు సజావుగా జరిగేందుకు ఏర్పాట్లు చేపట్టినట్లు చెప్పారు. నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో సుమారు 10వేల మందితో సామూహిక యోగా కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. యోగాలో పాల్గొన్న వారందరికి సర్టిఫికెట్లు ప్రదానం చేస్తామన్నారు. విద్యార్థులు, స్వయం సహాయ సంఘాల మహిళలు, అధికారులు, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, యువత అందరిని పెద్దఎత్తున భాగస్వామ్యం చేస్తూ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో నోడల్ ఆఫీసర్ యతిరాజ్, డిఇవో బాలాజీరావు, జడ్పీ సిఇవో మోహన్రావు తదితరులు పాల్గొన్నారు.

రేపు యోగా దినోత్సవం, స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర నిర్వహించాలి

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు: స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా ఈనెల 21వ తేదీ మూడోశనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవంతో పాటు స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను సంయుక్తంగా నిర్వహిం చాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం 6.30 గంటల నుంచి 8.30 గంటల వరకు వార్డు స్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు ఎంపికచేసిన ప్రదేశాల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో కామన్ యోగా ప్రోటోకాల్ను పాటించాలన్నారు. యోగా కార్యక్రమం ముగిసిన అనంతరం పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యాలయలను పరిశుభ్రం చేసుకోవాలని సూచించారు. అన్ని సచివాలయాలు, పార్కులు, కార్యాలయాల్లో, పాఠశాలల్లో గ్రీన్ యోగా కార్యక్రమంలో భాగంగా విరివిగా మొక్కలు నాటాలన్నారు. పర్యావరణాన్ని పెంపొందించేలాయోగా నినాదాలతో ర్యాలీలు నిర్వహించాలన్నారు. యోగా, స్వర్ణాంధ్ర కార్యక్రమాలపై విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించాలన్నారు. యోగా, స్వర్ణంధ్ర స్వచ్ఛంధ్ర కార్యక్రమాలను పర్యావరణహితంగా చేపట్టాలని, ఎక్కడా కూడా ప్లాస్టిక్ వాడకుండా క్లాత్ మ్యాట్స్ వినియోగించాలని, ఆర్గానిక్ స్నాక్సను అందించాలని, తిరిగి వినియోగించే వాటర్ బాటిల్స్, కప్స్, ప్లేట్లను వినియోగించాలని పేర్కొన్నారు. అధికారులు, ప్రజలు, స్వయం సహాయక సంఘ మహిళలు, విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అందరూ పెద్దఎత్తున యోగాంధ్ర, స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా కోరారు.

ఎన్నికల హామీలో చెప్పిన విధంగా అందరికీ తల్లికి వందనం ఇవ్వాలి

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు: తల్లికి వందనం పథకం అర్హులైన వారికి ఇవ్వాలి సయ్యద్ సిరాజ్ సిపిఐ నెల్లూరు నగర సహాయ కార్యదర్శిసంతపేట సిపిఐ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో తల్లికి వందనం పథకం ద్వారా అర్హులైన వారికి ఇంట్లో ఎంతమంది విద్యార్థులు ఉంటే అంతమందికి 15వేల రూపాయలు ఇస్తామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సరం తర్వాత విద్యార్థి తల్లుల ఖాతాల్లో 13 వేల రూపాయలు వేయడం జరిగింది అయితే చాలామంది విద్యార్థుల తల్లుల ఖాతాలో డబ్బులు జమ కాలేదు కారణాలు సొంత ఇల్లు లేని వారికి పైన కరెంటు మీటర్లు చూపించడం కరెంట్ బిల్లులు 300 యూనిట్లు కంటే ఎక్కువ వస్తున్నాయి అని అనేక కారణాలు చూపిస్తూ తల్లికి వందనం వర్తించదు అని చెప్పినప్పుడు ఆ తల్లులు కరెంట్ ఆఫీసులు చుట్టూ స్కూల్లో చుట్టూ అధికారులు చుట్టూ సొంత ఇల్లు లేని మాకు కరెంట్ మీటర్లు ఎలా వచ్చాయని రోదిస్తున్నారు కనుక ప్రభుత్వం వెంటనే స్పందించి అర్హులైన నిరుపేద విద్యార్థులకు తల్లికి వందనం పథకం అందేలాగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు శానవాజ్, ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షులు అజీజ్ అహ్మద్, షాజహాన్,రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ కంచర్ల రామయ్య మృతి తీరని లోటు: ఎమ్మెల్యే ఇంటూరి

విశాలాంధ్ర-కందుకూరు: ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ స్థాపకులు, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ కంచర్ల రామయ్య మృతి పట్ల కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. డాక్టర్ రామయ్య తన వృత్తి జీవితాన్ని ఒక సాధారణ దినపత్రిక విలేఖరిగా ప్రారంభించి, అంచలంచలుగా ఎదుగుతూ విద్యారంగంలో తనదైన ముద్ర వేశారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన ఇంజనీరింగ్ విద్యను అందించాలనే ఉద్దేశంతో ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీని స్థాపించి, దశాబ్దాల పాటు విద్యా రంగంలో విశిష్ట సేవలు అందించారు. ఆయన సేవలను ఎమ్మెల్యే ఈ సందర్భంగా ప్రశంసించారు. డాక్టర్ రామయ్య కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఎమ్మెల్యే ప్రార్థించారు.

డాక్టర్ కంచర్ల రామయ్య అస్తమయం

విశాలాంధ్ర-కందుకూరు: దిగ్గజ పాత్రికేయులు ప్రకాశం ఇంజనీరింగ్ కళా శాల వ్యవస్థాపకులు చింత నాపరులు డాక్టర్ కంచర్ల రామయ్య అనారోగ్యంతో గురువారం సాయంత్రం హైదరాబాదు లోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో మృతి చెందారు రామయ్య జీవన ప్రస్థానం ఈనాడు పాత్రికేయునిగా కొనసాగి ఈనాడులో అంచలంచెలుగా ఎదిగి తన రచన పటనతో ఈనాడు పాఠక లోకాన్ని విశేషంగా ఆకర్షించారు .ఆ క్రమంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని సచివాలయ రిపోర్టర్ గా కూడా ఆయన పని చేశారు తరుణానంతరం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సాంకేతిక విద్య అందించాలని ధృఢ సంకల్పంతో కందుకూరు లోని దోపగుంట వద్ద ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ నెలకొల్పి వేలాది మంది విద్యార్థులను టెక్నో కార్స్ గా తీర్చిదిద్దారు ఆయన మృతి పట్ల డాక్టర్ రామయ్య స్నేహితులు బంధుమిత్రులు విద్యార్థులు అధ్యాపకులు తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు తూర్పు రాయలసీమ ఎమ్మెల్సీ విద్యావేత్త విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ రామయ్య కుమారుడు ఆయన రాజకీయ ఉన్నతిని రాజకీయ ప్రస్తానాన్ని చూచి డాక్టర్ రామయ్య ఎంతగానో గర్వించేవాడు. డాక్టర్ రామయ్య దగ్గుబాటి వెంకటేశ్వరరావు పురందరేశ్వరి దంపతులకు అత్యంత సన్నిహితుడు, పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడుకు ఆత్మీయుడుగా ఆయన మసులుకొన్నాడు ఉమ్మడి రాష్ట్రాల్లోని అనేకమంది ఎమ్మెల్యేలు ఎంపీలు ఎమ్మెల్సీలు మాజీ మంత్రులతో ఆయనకు స్నేహ సంబంధాలు ఉన్నాయి.

ఖాదర్ భాషా కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే పరామర్శ

విశాలాంధ్ర-కావలి: కావలిలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన టిడిపి రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి కావలి వాసి షేక్ ఖాదర్ భాషా కుటుంబ సభ్యులను కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణా రెడ్డి గురువారం నాడు పరామర్శించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి అండగా ఉంటానని భరోసా కల్పించారు.

జర్నలిస్ట్ ఓలేటి నాగేశ్వరరావు కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే పరామర్శ

విశాలాంధ్ర-కావలి: కావలి పట్టణంలో వివిధ పత్రికల్లో విలేకరిగా 40 సంవత్సరాల నుండి పనిచేస్తున్న వార్త సీనియర్ జర్నలిస్ట్, ఆర్యవైశ్య నాయకులు ఓలేటి నాగేశ్వరరావు సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి గురువారం నాగేశ్వరావు నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. నాగేశ్వరావు కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు.

జర్నలిస్ట్ పిల్లలు ప్రైవేటు పాఠశాలలో 50 శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-నెల్లూరు సిటీ: నెల్లూరు జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు పాఠశాలలో 50% రాయితీ కల్పించాలని కోరుతూ నెల్లూరు జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ కు నెల్లూరు జిల్లా ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ అధ్యక్షుడు ఇసనాకుల మల్లికార్జున్ గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్పందిస్తూ డీఈఓకి ఫోన్ ఫోన్ ద్వారా జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలలో 50% రాయితీ అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కావున ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జర్నలిస్టుల మిత్రులందరూ 50% రాయితీ కొరకు డీఈవో కి పిల్లల వివరాలు తెలియజేస్తే స్కూల్ యాజమాన్యంతో మాట్లాడి అమలు చేస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ కెమెరామెన్లు ప్రవీణ్, ప్రదీప్, మనోజ్, సురేంద్ర, అభిషేక్, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

మోడీ పథకాలపై అవగాహన

విశాలాంధ్ర-రాపూరు: 11 సంవత్సరాల మోడీ సుపరిపాలన సేవ అభివృద్ధి వికసిత భారతదేశపు అమృతకాలం గురించి రాపూరు మండలం లోని రామదేవుపల్లిలో బిజెపి నాయకులు తోటకూర శంకరయ్య ఏర్పాటుచేసిన స్ట్రీట్ కార్నర్ సమావేశంలో రాపూరు బిజెపి మండల అధ్యక్షులు దూడలపెంచలయ్య మండల అధికార ప్రతినిధి మండల ప్రధాన కార్యదర్శి మనుబోలు శివ ప్రసాద్ పాల్గొని మోడీ ప్రవేశపెట్టిన పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు మరియు కరపత్రాలను అందజేయడం జరిగింది.

పలు కార్యక్రమాల్లో పాల్గొన్న కావలి ఎమ్మెల్యే

విశాలాంధ్ర-కావలి: కావలి శాసన సభ్యులు దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి గురువారం పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కావలి పట్టణంలో వివిధ పత్రికల్లో విలేకరిగా 40 సంవత్సరాల నుండి పనిచేస్తున్న వార్త సీనియర్ జర్నలిస్ట్, ఆర్యవైశ్య నాయకులు ఓలేటి నాగేశ్వరరావు ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి గురువారం నాగేశ్వరావు నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. నాగేశ్వరావు కుటుంబానికి అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. తన కలం ద్వారా అనేక సమస్యలను అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరింప చేశారని అన్నారు. ఒక మిత్రుడుగా అనేక సలహాలు అందించేవాడని తెలిపారు. నాగేశ్వరావు లేని లోటు వ్యక్తిగతంగా తనకు కూడా లోటని తెలిపారు... అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి, కావలి వాసి షేక్ ఖాదర్ భాషా కుటుంబ సభ్యులను కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి పరామర్శించారు. ముందుగా ఖాదర్ బాషా చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి అండగా ఉంటానని భరోసా కల్పించారు. అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన జర్నలిస్టు బషీర్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. ప్రమాద కారణాలను అడిగి తెలుసుకున్నారు. జాగ్రత్తలు పాటించి త్వరగా కోలుకోవాలని తెలిపారు.. ఈ కార్యక్రమంలో కావలి పట్టణ టిడిపి అధ్యక్షులు గుత్తికొండ కిషోర్ బాబు, ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు, రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, కండ్లగుంట మధుబాబు నాయుడు, పట్టణ మహిళా అధ్యక్షురాలు అర్షియా బేగం, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సాహిత్య అకాడమి-బాలసాహిత్యం

తెలుగు విభాగంలో పైరవీలు జరిగాయనేది జగమెరిగిన సత్యం

- టీ.వి.రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు: సాహిత్య అకాడమి - బాలసాహిత్యం తెలుగు విభాగంలో పైరవీలు జరిగాయనేది జగమెరిగిన సత్యం. ముందుగానే ఫలితాలు తెలుస్తున్నాయంటే దానిని ఏమనాలి? అని ప్రముఖ కవి విశ్లేషకులు టీవీ రామకృష్ణ ఓ ప్రకటన ద్వారా ఆవేదన వ్యక్తంచేస్తూఇంకొక ముఖ్యమైన విషయం ఏమిటంటే,ఎంపికైన రచనలను పరిశీలిస్తే బాలసాహిత్యానికీ అత్యంత ప్రమాణాలున్న రచనలు కావు. ఉన్న వాటిలో ఫరవాలేదనిపించే లేదా పైరవీలద్వారా ఎంపికలు జరుగుతున్నాయి. మనం బాలసాహిత్యానికి సంబంధించిన అవార్డులను సంబందించిన రచనలను పరిశీలిస్తే మనకు అర్థమవుతుంది మనం ఏం స్థాయిలో ఉన్నామో! మన రచనలన్నీ 20-30 సంవత్సరాల వెనుక బడి ఉన్న రచనలే ఇప్పటికీ కొనసాగుతున్నాయి. బాలసాహిత్యం మీద సరైన అధ్యయనం, అవగాహనా రచయితలకు, సో కాల్డ్ జ్యూరీ ఆర్ జడ్జిస్‌కి లేకపోవడం కారణం. ఇక్కడ బాలసాహిత్యం మీద సరైన అధ్యయనం లెకుండా రచనలను మూసపద్ధతిలో, పాతపద్ధతిలోనే రచనలను కొనసాగిస్తున్నాం. మార్పుకు మనం ప్రయత్నించటంలేదు. చందమామ కథల ప్రభావాన్నించి మనం ఇప్పటికీ బయటపడలేకున్నాం. మనకు, అవార్డులు, సన్మానాలు, భట్రాజు పొగడ్తల మీద ఉన్న ఆసక్తి బాలసాహిత్యాన్ని సంస్కరించటంలోను, అధ్యయనం చేయటంలోను లేదు. మనం బాలసాహిత్య రచయితల ఆధునిక తెలుగు బాలసాహిత్యంవైపు పయనించనంతకాలం మన తెలుగు బాలసాహిత్య వ్యవస్థ ఇలాగే జోగుతూ కొనసాగుతుంది. దీనికి ఎవ్వరిని నిందించి ప్రయోజనం లేదు.తానా-మంచి పుస్తకంఎంపిక విషయంలో కూడా ఇదే మూసవిధానాలు, పైరవీలు కొనసాగుతున్నాయంటే మన బాలసాహిత్యం ఏ స్థాయిలో ఉందో మనం అర్థంచేసుకోవచ్చు.ఇదేదో దుగ్ధతో నేను అనటం లేదు. మంచి విలువలున్న, ఆధునిక, సమకాలీన బాలసాహిత్యం రావాలని, బాలసాహిత్య రచయితలం దరూ అందుకోసం కృషిచేయాలని, మనందరం కూర్చోని ఆలోచించాలని, మనల్నిమనం ప్రశ్నించుకోవాల్సిన అవసరం ఉందని తెలియజేయడమే నా ప్రధాన ఉద్దేశం. ఇందులో విషయాలు ఎవరినైనా బాధించి ఉంటే క్షంతవ్యుడను. నా బాధంతా మంచి, ప్రామాణిక బాలసాహిత్య అందించాలని, మన రచనా విధానంలో మార్పులు రావాలని నా ఈ ప్రయత్నం అని రామకృష్ణ ఓప్రకటన ద్వారా తెలిపారు.

పారిశుద్ధ్య పనులను దగ్గరుండి చేయించిన సయ్యద్ ఆరీఫా

విశాలాంధ్ర-రాపూరు: రాపూరు మేజర్ పంచాయతీలోని రాపూరు టౌన్‌లో పారిశుధ్యం, డ్రైనేజ్ పరిశుభ్రత పనులను 7వ వార్డు సభ్యురాలు సయ్యద్ ఆరీఫా కార్మి కులతో తన వార్డులో ప్రత్యక్ష పర్యవేక్షణలో చేయించారు. అంతేకాకుండా తన వార్డులో వున్న స్థానికులకు సమస్యలున్న తెలుసుకొని వారికి అందుబా టులో వుంటూ తనవంతు సేవలందిస్తూ స్థానికులచే ప్రశం శలందుకుంటున్నారు. అంతేకాకుండా రాష్ట్ర ఎస్సీ, ఎస్సీ, బిసి, మైనారిటీ యునైటెడ్ ఫోరం జిల్లా అధ్యక్షురాలిగా కూడా సేవలందిస్తున్నారు.

వెన్నవాడలో గడ్డివామి దగ్ధం

విశాలాంధ్ర-నెల్లూరు: పసుపులేటి చెంచయ్య అనే రైతు యొక్క దొడ్డిలో గడ్డివాము వేసుకొని ఉంటే గురువారం సచివాలయం సిబ్బంది చెప్పిన దానికి మేరకు పక్కనే విద్యుత్ వైర్లు కారణంగా పెద్ద శబ్దం వచ్చి షార్ట్ సర్క్యూట్ వల్ల గడ్డివామి మండుకున్నది అని సచివాలయ సిబ్బంది చెబుతున్నారు సచివాలయం పక్కనే ఉంది కాబట్టి వాళ్లు జరిగిన విషయాన్ని వివరించారు. రైతు మాట్లాడుతూ మూడు ఎకరాల వరిగడ్డి బరాలు కోసం గడ్డి వాము వేసుకొని ఉన్నాను సుమారు 30 వేల రూపాయల విలువచేసే గడ్డి దగ్ధమైనట్టు రైతు విచారం వ్యక్తం చేశాడు

రాజుపాలెం బస్సు సమస్యపై వెంటనే స్పందన

కలువాయి జనసేన పార్టీ కృషికి రాజుపాలెం కాలనీ వాసులు కృతజ్ఞతలు

విశాలాంధ్ర-కలువాయి: జనసేన పార్టీ ఆధ్వర్యంలో బుధవారం రోజు కలువాయి మండలంలోని రాజుపాలెం గ్రామానికి చెందిన ప్రజలు విద్యార్థులు బస్సు సౌకర్యం, లేకపోవడం గురించి వచ్చిన ఫిర్యాదుపై వెంటనే స్పందన వచ్చినట్లు, గురువారం ఉదయం ఏపీఎస్ఆర్టీసీ బస్సు రాజుపాలెం గ్రామానికి చేరుకోవడంతో, ఎస్సీ కాలనీ వాసులు మరియు విద్యార్థులు ఆనందంతో బస్సు ఎక్కారు. ఈ సందర్భంగా గ్రామస్తులు జనసేన పార్టీకి, అలాగే ఏపీఎస్ఆర్టీసీ రీజనల్ ఛైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి, డిపో మేనేజర్ మరియు అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పేదలకు భోజనం ప్యాకెట్లు వితరణ

విశాలాంధ్ర-కావలి: కావలి పట్టణం నివాసులు కానిస్టేబుల్ షేక్.బాబుల్ - రమీజ దంపతుల పెళ్లి రోజు సందర్భంగా గురువారం సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర ఆధ్వర్యంలో కావలి పట్టణం పరిసర ప్రాంతమైన బుడంగుంట గిరిజన కాలనీలోని పేదలకు భోజనం ప్యాకెట్లు వితరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర మాట్లాడుతూ తమ యొక్క సంస్థ ద్వారా పేదలకు ఆకలి తీర్చిన దాతలు షేక్.బాబుల్ - రమీజ దంపతులకు ధన్యవాదాలు తెలియజేస్తూ ఉన్నామని తెలిపారు. ఇలాంటి పెళ్లి రోజులు మరెన్నో జరుపుకోవాలని ప్రార్థిస్తూ ఉన్నామని తెలిపారు.

కావలి సబ్‌జైలులో ఉన్న వారికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

విశాలాంధ్ర-కావలి: సోషల్ మీడియాలో ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతున్నారన్న కారణంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దళిత నాయకుడు ఆత్మకూరి రాజేష్, దళిత జర్నలిస్ట్ దామెర్ల శ్రవణ్ కుమార్ లను అక్రమంగా అరెస్టు చేసి కావలి సబ్ జైలు నందు రిమాండ్ లో ఉన్న వారిని పరామర్శించిన కావలి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మరియు మాజీ శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డిఅదే విధంగా బోగోలు మండలం కడనూతల కి చెందిన వైఎస్ఆర్సిపి నాయకులు ను స్థలం విషయం లో టీడీపీ నాయకులు మారణాయుధాలతో దాడి చేసి తిరిగి వైసిపి నాయకులైన నాటకరాణి వెంకట రామయ్య మరియు బాబు పై అక్రమ కేసు బనాయించి రిమాండ్ లో ఉన్న వారి పై పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి కావలి నియోజకవర్గం అభివృద్ధిపై దృష్టి పెట్టకుండా వైయస్సార్సీపీ నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఆత్మకూరి రాజేష్ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం గా ఉండాలని పార్టీ తరఫున అన్ని విధాల అండగా ఉంటామని ప్రతాప్ కుమార్ రెడ్డి తెలిపారు.

ఆదాల ఆశీస్సులు తీసుకున్న నిషిత

విశాలాంధ్ర-నెల్లూరు టౌన్: నెల్లూరు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ నియోజకవర్గం ఇన్చార్జ్ ఆదాల ప్రభాకర్ రెడ్డి ని గురువారం నెల్లూరులోని ఆయన కార్యాలయంలో ఇటీవల విడుదలైన ఈసెట్-25 ఫలితాలలో అగ్రీ ఇంజినీరింగ్ విభాగంలో రాష్ట్రస్థాయిలో 24వ ర్యాంకు సాధించిన రేవూరు నిషితకలిసి ఆశీస్సులు తీసుకుంది. తన విద్యకు అవసరమైన ఆర్థిక సహాయ సహకారాలను అందించి ప్రోత్సహించిన మాజీ పార్లమెంట్ సభ్యులు ఆదాల ప్రభాకర్ రెడ్డికి ఈ సందర్భంగా రేవూరు నిషిత ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.

అభివృద్ధిపనులలో నాణ్యతప్రమాణాలను పాటించండి

- కమిషనర్ వై.ఓ నందన్

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు: నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులలోనాణ్యత ప్రమాణాలను పాటించడంతోపాటు వేగవంతంగా పూర్తి చేసేలాకాంట్రాక్టర్లను పర్యవేక్షించాలని అధికారులను కమిషనర్ వై.ఓ నందన్ ఆదేశించారు. కార్యాలయంలోని కమిషనర్ చాంబర్లో ఇంజనీరింగ్ విభాగం అధికారులు, కాంట్రాక్టర్లతో సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శానిటేషన్ విభాగానికి ఇంటింటి చెత్త సేకరణకు అవసరమైన వాహనాలను సమకూర్చి, వాటి నిర్వహణ బాధ్యతలను కాంట్రాక్టర్లు చూసుకోవాలని తెలిపారు. అన్ని ప్రధాన డివిజన్లలో అవసరమైన డివైడర్ల నిర్మాణం, డివైడర్ల పెయింటింగ్ పనులు, ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకు పెయింటింగ్ పనులను నిర్దేశించిన సమయానికి పారదర్శకంగా పూర్తి చేయాలని కమిషనర్ సూచించారు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగంఎస్ ఇ రామ్ మోహన్ రావు, ఈ.ఈ లు శేషగిరిరావు, రహంతు జానీ, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చైతన్య,ఉద్యాన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నరసింహారావు,డి.ఈ లు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

సీనియారిటీ ఆధారంగా సచివాలయ ఉద్యోగుల బదిలీలు నిర్వహించాలి

ఏఐవైఏఫ్ జిల్లా కార్యదర్శి షేక్ మున్నా

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు: రాజకీయాలకు తావులేకుండా పారదర్శకంగా బదిలీ ఉండాలి ఉపాధ్యాయుల మాదిరిగానే గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలు కూడా వారి సీనియార్టీ ఆధారంగానే కౌన్సిలింగ్ అత్యంత పారరదర్శకంగా నిర్వహించాలని అఖిలభారత యువ జన సమాఖ్య జిల్లా కార్యదర్శి షేక్ మున్నా కోరారు. ఈ మేరకుడి ఆర్ ఓ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జరగబోతున్న సచివాలయ ఉద్యోగుల బదిలీలలో చాలా మంది ఉద్యోగులు తమకు అనుకూలంగా ఉన్న స్థానాలకోసం రాజకీయ బలాలను ఉపయోగిస్తున్నారని తెలిపారు. బదిలీల కౌన్సిలింగ్ అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని ఉద్యోగులు కోరుతున్నారని చెప్పారు. సాధారణంగా బదిలీల కౌన్సిలింగ్ సీనియారిటీ లిస్టుల ఆధారంగా నిర్వహించాలని. కానీ ఇలా లెటర్స్ తెచ్చుకోవడం వలన ఒకే స్థానానికి చాలామంది పోటీ పడే అవకాశం కనపడుతున్నదన్నారు. ఒకవేళ కేవలం లెటర్ల సహాయంతో మాత్రమే బదిలీలు జరిగితే సీనియారిటీ కలిగిన ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో సీనియారిటీకి విలువ లేకుండా పోతున్నదని, ఉద్యోగుల మధ్య మనస్పర్థలు వచ్చే అవకాశం కూడా ఉందని తెలిపారు. గ్రామ,వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలు వారి సీనియారిటీ ఆధారంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో నగరఅధ్యక్షులు గౌస్ భాష, బాదుల్ల, వీమీర, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

రాములవారి తిరణాల్లో ఎమ్మెల్యే సోమిరెడ్డి

విశాలాంధ్ర-మనుబోలు: మనుబోలు మండలం కొమ్మలపూడి గ్రామంలో గురువారం నిర్వహించిన రాములవారి తిరణాలకు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. రాములవారి తిరుణాల్లో భాగంగా అంగరంగా వైభవంగా ఆలయాన్ని తీర్చిదిద్దారు. విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి కు నాయకులు మన్నెమాల శ్రీనివాసులు రెడ్డి, మన్నెమాల భాస్కర్ రెడ్డి, మన్నెమాల ఆదినారాయణ రెడ్డి పూలమాల శాలువాతో సత్కరించి బాణా సంచా మేళ తాళాలతో ఘన స్వాగతం పలికారు. సీతారాముల కల్యాలాన్ని తిల కించడానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే సోమిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ సీతారాముల కళ్యాణం ఉత్సవంలో పాల్గొన్న అదృష్టంగా భావిస్తున్నామన్నారు. దేవుడు ప్రతిష్ట జరిగిన రోజే తిరణాలు జరపడం గ్రామ అన్వాయతిగా నడుస్తుందని అన్నారు. గ్రామం సుభక్షంగా ఉండాలని ఆ భగవంతుని ప్రార్థిస్తున్నామన్నారు. 14వ వార్షికోత్సవం తాను పాల్గొను పూర్వజన్మ సుకృతం అన్నారు.ఆ సీతారాముల ఆశీస్సులు నియోజవర్గ ప్రజలకు ఉంటాయని తెలిపారు. తిరునాళ్లు నిర్వహిస్తున్న ఆలయ కమిటీ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏడాది పాలన రసవత్తరంగా సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏం సి చైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి, పొన్నూరు రామకృష్ణయ్య, బొమ్మి సురేంద్ర, మస్తాన్ నాయుడు, మధు నాయుడు, కిష్టమనాయుడు, రామానాయుడు, ఎంపీటీసీ గుండాల శిరీష, ఉమామహేశ్వర్ రెడ్డి, భక్తవత్సల రెడ్డి, వెంకు రెడ్డి, శ్రీధర్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, కొండ్రెడ్డి శ్రీనివాసులు రెడ్డి, గుండాల రమేష్, కందల పెంచలయ్య, ఉడతా హరిబాబు యాదవ్ రాయపాటి కిరణ్, పొట్టేలు ప్రసాద్, జయరామయ్య, అంకయ్య గౌడ్, సుధాకర్ రెడ్డి, వెంకటరమణ రెడ్డి, ఎస్సై రాకేష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. పెద్ద ఎత్తున టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ ఏడాది పాలన బీసీలకు స్వర్ణయుగము

డాక్టర్ జడ్ శివప్రసాద్

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు: పెన్షన్లు పెంపు, తల్లికి వందనం పథకాల లబ్ధిదారులలో సింహభాగం బీసీలదే, నామినేటెడ్ పదవులు, చట్ట సభలు, స్థానిక సంస్థలురంగం ఏదైనా కూటమి ప్రభుత్వం లో బీసీ లదే అగ్ర తాంబూలం ఇచ్చిందని రాష్ట్ర ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ బోర్డ్ చైర్మన్ డా. జడ్. శివప్రసాద్ జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో తెలిపారుబీసీ లపై దాడులు చేయాలంటే వణుకు పుట్టేలా బీసీ రక్షణ చట్టం విధివిధానాలను రూపుదిద్దుతోంది కూటమి ప్రభుత్వం. 2025-26 రాష్ట్ర బడ్జెట్ లో 47,457 కోట్ల రూపాయలను బీసీ ల అభివృద్ధి కి కేటాయించింది శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, రాష్ట్ర కేబినెట్ లోని 8 మంది మంత్రులు,38 మంది శాసన సభ్యులు బీసీ లే. 2014-19 టిడిపి ప్రభుత్వ హయాంలో 3700 కోట్ల రూపాయలను బీసీ కార్పొరేషన్ ల కోసం తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఖర్చు చేసింది. నేటి కూటమి పాలన లో పెద్ద ఎత్తున నిధులు కేటాయించింది.గత వైసీపీ ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ లకు నిధులు నిలిపివేసింది, సబ్సిడీ రుణాలను రద్దు చేసింది. బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూసింది.స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ లను 20 నుండి 34 శాతం పెంచిన టిడిపి నేడు చట్ట సభల్లో బీసీ లకు 33 శాతం రిజర్వేషన్ ల అమలు కు తీర్మానం చేసి కేంద్రానికి పంపింది. చేతి వృత్తులపై ఆధారపడిన 4.2 లక్షల మంది పేద బీసీ లకు ఆదరణ పథకం ద్వారా అత్యాధునిక పరికరాలు అందించిన టిడిపి ప్రభుత్వం నేడు ఆదరణ -3 పథకం కు ప్రతీ యేటా 1000 కోట్ల రూపాయలను కేటాయిస్తోంది.గీత కార్మికులకు మద్యం దుకాణాల్లో 10 శాతం కేటాయించింది కూటమి ప్రభుత్వం. స్వర్ణ కారుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్ ను ఏర్పాటు చేసింది.20 లక్షల మంది మత్స్యకారుల ఉపాధి ని దెబ్బ తీసే జీవో 217 ను కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. "మత్స్యకారుల సేవలో " పథకం కింద వేట నిషేధకాల భృతి రూ. 20 వేలకు పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానిదే. దేవాలయాలలో నాయీ బ్రాహ్మణుల వేతనాలను 25 వేల రూపాయలకు పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానిదే. బీసీ లంటే వెనుకబడిన వర్గాలు కాదు, దేశానికే వెన్నెముక లాంటి వారని గుర్తించిన ఏకైక పార్టీ తెలుగుదేశం అని అన్నారు ఈ సమావేశంలో ఉమ్మడినెల్లూరు జిల్లాకు చెందిన పలువురు బీసీ సంఘానికి నాయకులు తెలుగుదేశం పార్టీ బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి: ఈవోపీఆర్డి

విశాలాంధ్ర-మనుబోలు: మనుబోలు మండలంలో పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఈవోపిఆర్డి నారాయణ పేర్కొన్నారు. ఆయన స్థానిక మీడియాతో మాట్లాడుతూ మండలంలో ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి తడి చెత్త పొడి చెత్త వేరు చేసి ,చెత్త సంపద కేంద్రానికి తరలించి వర్మీ కంపోస్టుకు పాటుపడుతున్నా మని తెలిపారు. గ్రామాల్లో పరిశుభ్రమైన వాతావరణం కల్పించా లని ప్రభుత్వ సంకల్పాన్ని మండల అధికార యంత్రాంగం కృషి చేస్తుందని తెలిపారు. అదేవిధంగా మండలంలో ఉండే అన్ని ట్యాంకులు ఎప్పటికప్పుడు శుభ్రం చేసి అన్ని గ్రామాల్లో నాణ్యమైన శానిటేషన్ మంచినీటి సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా అధికారులు చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు.

రామతీర్థంలో వైభవంగా చిలుక వాహన సేవ

విశాలాంధ్ర-విడవలూరు: విడవలూరు మండలం రామతీర్థం గ్రామంలో శ్రీ రామలింగేశ్వరుడు బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారు చిలక వాహనపై ఊరేగారు తానే లోకంలో అందగాడునని గర్వంతో ఉన్న మన్మధుడుని శివుడు తన మూడో నేత్రంతో దహించి గర్వభంగం చేస్తాడు భౌతిక సౌందర్యం కన్నా భక్తి గొప్పదని భక్తులకు సాటేందుకు ప్రతి మన్మధుడు అని రూపంలో ప్రత్యేకంగా అలంకరించిన చిలుక వాహనంపై అధిరోహించి స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత ఆలయ అర్చకులు శ్రీకాంత్ శర్మ స్వామివారికి గణపతి పూజ రుద్రాభిషేకం అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మ వాళ్లకు సుమారు వేణుగోపాల్ మత్కార యూత్ పోలంగి సేవను ఘనంగా జరిపారు. భక్తులకు లక్ష్మీపురం గ్రామానికి చెందిన గ్రామ కాపులు కొండూరు సుబ్రహ్మణ్యం రంగం గారి వెంకటేశ్వర్లు గోవిందు అన్నదానం చేశారు. మల్లికార్జునరెడ్డి ఉత్సవ కమిటీ చైర్మన్ సురేష్ గుమస్తా వెంకటేశ్వర్లు గోవి భక్తులుందు గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

చౌక దుకాణం డీలర్లతో తహసిల్దార్ సమీక్ష



విశాలాంధ్ర-తోటపల్లి గూడూరు: తోటపల్లి గూడూరు మండలంలోని మండల కార్యాలయంలో గురువారం చౌక దుకాణం డీలర్లతో తాసిల్దార్ బూదూరు పద్మావతి సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా డీలర్లతో మాట్లాడుతూ 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నిత్యవసర సరుకులు ప్రజలకు అందుబాటులో ఉంచాలని తెలిపారు. తప్పనిసరిగా స్టాక్ రిజిస్టర్ లో సరుకుల వివరాలు నమోదు చేయాలన్నారు. రేషన్ దుకాణంలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసిల్దార్ శివయ్య, రెవెన్యూ ఇన్స్పెక్టర్ యశ్వంత్, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

రూ.15 కోట్లు విలువ గల స్థలాన్ని స్వాధీనం చేసుకున్న రెవెన్యూ అధికారులు

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు: నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని జాతీయ రహదారి సాక్షి ప్రధాన కార్యాలయం పక్కన సర్వే నెంబర్ 295 లో అహోబిలంమఠంకు చెందిన రెండు ఎకరాల స్థలం ఉండేది. అయితే కాలక్రమేనా ఈ స్థలాన్ని ఓమాజీ పార్లమెంటు సభ్యుడు తనకున్న అధికార బలంతో తాను సొంతం చేసుకున్నాడు. మాజీ ఎంపీ కున్న పలుకుబడి, ఆర్థిక బలంతో అహోబిలం పీఠం వారు ఈ స్థలం కోసంఎన్నిసార్లు పోరాటం చేసిన అది సఫలం కాలేదు. అధికారుల దృష్టికి అప్పటి పాలకుల దృష్టికి తీసుకువెళ్లిన వారు దీనిపై చర్యలు తీసుకోలేదు.తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం అహోబిలం పీఠం ప్రతినిధులు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిని కలిసి తమ సమస్యను తెలియజేయడంతో పాటు ఉన్నతాధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లడంతో వెంటనే రూరల్ ఎమ్మెల్యే స్పందించిసాక్షి కార్యాలయం పక్కన ఉన్న రెండు ఎకరాల స్థలానికి సంబంధించి పూర్వ పరాలను సేకరించి ఇది అహోబిలం పీఠం స్థలంగా నిర్ధారించారు. రెవిన్యూ అధికారులు కూడా ఈ అంశంపై స్పందించి 15 కోట్లు విలువ చేసే ఈ రెండు ఎకరాలు స్థలంలో ఈ స్థలం అహోబిలం పీఠంకు చెందిందని గురువారం బోర్డునాటారు. రెవిన్యూ అధికారుల చర్యలతో మాజీ ఎంపీకి గట్టి షాక్ తగిలింది.

తాహసిల్దార్, డిటిలను కలసిన అక్కంపేట టిడిపి నేతలు



విశాలాంధ్ర-మనుబోలు: మనుబోలు మండలం అక్కంపేట టిడిపి నేతలు నూతనంగా బాధ్యతలు చేపట్టిన తాహసిల్దార్ రమాదేవిను గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి బోకే అందజేశారు. అదేవిధంగా డిటి ప్రదీప్‌ను కలసి శాలువాతో సత్కరించారు. రాష్ట్ర మైనారిటీ నేత షేక్ అమీర్ భాష, నీటి సంఘం అధ్యక్షులు కోదండరామిరెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, ఆంజనేయులు, తదితరులు ఉన్నారు.

విడవలూరు ఎంపీటీసీ ఎన్నికకు రంగం సిద్ధం

విశాలాంధ్ర-విడవలూరు: విడవలూరు పంచాయతీ బిట్ వన్‌లో ఖాళీగా ఉన్న ఎంపీటీసీ ఎన్నికకు మండల రెవెన్యూ అధికారులు సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసినట్లు నగేష్ కుమారి తెలిపారు. విడవలూరు ఎంపీటీసీగా గెలిచి ఎంపీపీగా ఎన్నికైన వేడుక భవనమ్మ అనారోగ్యంతో మృతి చెందడం ఆసిడ్ బ్యాంకుకు ఎన్నికలు అనివార్యమయ్యాయి. ఈ మేరకు నిర్వహించడానికి ఎన్నికల సంఘం రంగం సిద్ధం చేశారన్నారు. ఓటర్ల జాబితా సిద్ధం చేసి ఈనెల 30వ తేదీన పంచాయతీ రెవెన్యూ మండల కార్యాలయంలో ప్రచురించాలని ఎన్నికల కమిషన్ జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

నిబంధనలు పాటించని ప్రైవేట్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-కలువాయి: ప్రభుత్వం జీవో ప్రకారం ప్రైవేట్ స్కూల్ లో, మెటీరియల్, నోట్ బుక్స్ అమ్మకూడదు, అందుకు విరుద్ధంగా కలువాయి లోని ప్రైవేట్ స్కూళ్లు, ఫస్ట్ క్లాస్ కి సుమారు 5000 రూపాయలు, పదో తరగతికి 15000 వరకు మెటీరియల్‌కు తీసుకుంటున్నారు. ఫీజులు కూడా విపరీతంగా వసూలు చేస్తున్నట్లు, అన్నీ తెలిసిన మండల విద్యాశాఖ అధికారులు నిమ్మక నీరు ఎత్తినట్లు వ్యవహరిస్తున్నారని, ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారి స్పందించి సంబంధిత ప్రైవేట్ స్కూల్‌లపై చర్యలు తీసుకోవాలి అని, బీజేపీ సీనియర్ నాయకులు దండు పెంచలయ్య కోరారు.

విద్యతోనే విలువలతో కూడిన జీవితం

విశాలాంధ్ర-కావలి: కావలిలోని బ్లెస్స్ హోమ్‌లో పదవ తరగతి పాసైన విద్యార్థినీలను అభినందించడానికి విశ్రాంత అధ్యాపకులు ఎంవీఎన్ ప్రసాదరావు విచ్చేసి విద్యార్థినీలకు ఫైలు మరియు హాట్ బాక్స్ లను బహుమతిగా ఇచ్చి వారిని ఆశీర్వదించి పిల్లలందరికీ పండ్లను ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రసాదరావు మాట్లాడుతూ అన్ని దానాలలో కన్నా విద్యా దానం గొప్పదని విద్యతోనే విలువలతో కూడిన జీవితాన్ని గడపగలరని అదేవిధంగా ఆర్థికంగా ఎదగగలరని ప్రతి విద్యార్థి చక్కగా చదువుకొని వారి జీవితాల్లో స్థిరపడి జన్మనిచ్చిన తల్లిదండ్రులకు సేవ చేస్తూ అలాగే చదువు నేర్పిన గురువులను జ్ఞాపకం చేసుకోవాలని తెలిపారు. ప్రతి విద్యార్థి చదువు పట్ల శ్రద్ధ కలిగి అన్ని సబ్జెక్టులలో మంచి మార్కులు తెచ్చుకునేలా ప్రయత్నం చేయాలని కష్టంగా కాక ఇష్టంగా చదవాలని తెలిపారు. సామాజిక కార్యకర్త మాలకొండ రెడ్డి మాట్లాడుతూ బ్లెస్స్ హోమ్ పిల్లలు చక్కగా చదువుకొని పదో తరగతి పాస్ అయినందుకు వారికి అభినందనలు తెలుపుతూ మరెన్నో ఉన్నత చదువులు చదువుకోవాలని అదేవిధంగా ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. వ్యాయామ ఉపాధ్యాయురాలు ఓ.చంద్రిక మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తి కలిగి ఉండాలని చదువుతోపాటు ఆటలు ఆడటం వల్ల మంచి ఉద్యోగాలలో స్థిరపడవచ్చు అని అదేవిధంగా శారీరకంగా దృఢంగా ఉండవచ్చని అన్నారు. మీకోసం సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు దిలీప్ కుమార్ రాయపాటి మాట్లాడుతూ సంస్థను సందర్శించి విద్యార్థినిలకు బహుమతులు తో పాటు చదువు పట్ల మంచి అవగాహన కలిగించిన ప్రసాద్ రావు సార్ కి ప్రత్యేక కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు. బ్లెస్స్ హోమ్ స్థాపించినప్పటి నుంచి విద్యార్థులకు చదువు నేర్పించడమే కాక పదవ తరగతి పాస్ అవ్వడానికి కారణమైన గురువుల శేషగిరిరావుకు మరియు లలితకు శాలువాలతో వారిని ప్రసాద్ రావు, మాలకొండ రెడ్డి, డేనియల్ బాబ్జి,శైలజ మరియు సుప్రియ తదితరులు ఘనంగా సన్మానించడం జరిగింది.

సచివాలయాల్లో ప్రత్యేక అధికారులతో యోగా

విశాలాంధ్ర-రాపూరు: రాపూరు మండలంలోని 18 సచివాలయాల పరిధిలో ఎంపిక కాబడిన 150 ప్రదేశాల నందు యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించుటకు మరియు పరిశీ లకులు ప్రత్యేక అధికారులను నియమించడం జరిగిందని ఎంపిడిఓ భవాని తెలిపారు. ఈ సందర్భంగా భవాని తెలియజెస్తూ జిల్లా కలెక్టర్ ఆదేశాలతో మండలంలోని 18 గ్రామసచివాలాయల పరిధి ఎన్నిక కాబడిన య150 ప్రదేశాలలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించుటకు ప్రత్యేక అధికారులుగా నియమితులైన ప్రత్యేక అధికారులు -గిలక పాడు, బొజ్జనపల్లి సోము సుందరం ఎంఎఓ, వెపినాపి, చెర్లోపల్లి, బి.చంద్ర ఏపిఓ ఎంజిఎన్ఆర్ఈజిఎస్, కంభాలపల్లి ఏ.బాలకృష్ణ డివై ఎంపిడిఓ, శానయ పాళెం, సంక్రాంతి పల్లి జి. రామకృష్ణ ఏఈ హౌసింగ్ బోర్డు, పెనుబర్తి, గోనుపల్లి ఎస్.అంజనేయులు ఏఈఈ ఆర్ డబ్ల్యూఎస్, ఆకలి వలస, గుండవోలు ఎం.సురేష్ బాబు ఏఈఈ పిఆర్, రాపూరు 1,2,3 సచివాలయాలకు ఎంపిడిఓ భవాని, పొంగింది, సిద్దవరం. ఎం.చంద్రశేఖర్ ఏపిఎం వెలుగు, తెగచర్ల రాజ్యలక్ష్మీ ఐసిడిఎస్ సూపర్ డెంట్, జోరేపల్లి బి.రాధిక సూపర్ డెంట్ ఐసిడిఎస్, పై తెలిపిన అధికారులు వారికి కేటాయించిన గ్రామ సచివాలయలలో టీఓటీల సహకారంతో 21వ తేది ఉదయం 6.30 గంటలనుండి జరుగు యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయుటకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు చెయడం జరిగిందని ఎంపిడిఓ భవాని తెలిపారు.

రైతులకు వ్యవసాయ యంత్రపరికరాలు పంపిణీ

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు: వ్యవసాయ యాంత్రీకరణలో ఆధునిక శాస్త్ర సాంకేతిక పద్ధతులను రైతులకుమరింత చేరువ చేయాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ వ్యవసాయ అధికారులకు సూచించారు. గురువారం నెల్లూరులోని వ్యవసాయ పరిశోధన కేంద్రంలో జిల్లాస్థాయిలో వ్యవసాయ యంత్రపరికరాలను కలెక్టర్ ఆనంద్ రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2024-25 సంవత్సరమునకు గాను వ్యవసాయ యాంత్రీకరణ పథకము ద్వారా జిల్లాలో 1452 వ్యవసాయ యంత్రపరికరాలను రాయితీపై రైతులకు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ పరికరాల మొత్తం ధర రూ.6,80,48,750 కాగా, రూ.2,86,96,220 రాయితీగా మంజూరు చేసినట్లు చెప్పారు. వ్యవసాయ శాఖలోని సిబ్బంది అందరూ టెక్నాలజీ పై పట్టు సాధించి, విస్తృతంగా ప్రచారం చేసి రైతులకు ఉపయోగపడేలా చేయాలన్నారు. మట్టి నమూనాల పరీక్షల నుండి, వివిధ పంటల దశలలో అవసరమయ్యే శాస్త్రీయతను రైతులు అంది పుచ్చుకోవాలని కోరారు. ప్రాంతీయంగా రైతుల ఉపయోగపడే పనిముట్లను రూపొందించాలని పరిశోధన కేంద్రం వారికి సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారిణి పి.సత్యవాణి మాట్లాడుతూ, నియోజక వర్గ వారీగాఎన్ని పరికరాలు ఎంత సబ్సిడీ ఇచ్చారో వివరించారు. వీరితో పాటుగా ఆగ్రోస్ రీజనల్ మేనేజర్ విద్యాసాగర్, సహాయ వ్యవసాయ సంచాలకులు, వ్యవసాయ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

నాన్న బాధ్యత నేను తీసుకున్న

విశాలాంధ్ర-ముత్తుకూరు: నాన్న అందుబాటులో లేనందున తాను నియోజకవర్గంలోని వైసీపీ పార్టీ కార్యకర్తలకు నాయకులకు ప్రజలకు తాను అండగా ఉండేటువంటి బాధ్యతలు తీసుకోవడం జరిగిందని సర్వేపల్లి శాసనసభ్యులు మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి కుమార్తె పూజితమ్మ తెలిపారు. గురువారం మండలంలోని దువ్వూరు వారి పాలెం వైసిపి నాయకులు దువ్వూరు విజయభాస్కర్ రెడ్డి అనారోగ్యంతో ఇటీవల చెన్నైలో చికిత్స పొంది ఇంటికి వచ్చిన సందర్భంగా ఆమె ఆయనను పరామర్శించారు. ఆయన యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే తండ్రి కాకాని గోవర్ధన్ రెడ్డి పరిస్థితి గురించి కూడా ఆయనకు ఆమె వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అధికార పార్టీ అక్రమ కేసులు బనాయించడంతో మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో లేకుండా పోయాడని అయితే సర్వేపల్లి నియోజకవర్గం లోని వైసిపి నాయకులకు కార్యకర్తలకు ప్రజలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉండేందుకు తాను నాన్నగారి బాధ్యతలు తీసుకోవడం జరిగిందనిఆమె తెలిపారు.ప్రజాభిమాన నేత జగన్మోహన్ రెడ్డి ఆశీర్వాదం, సర్వేపల్లి నియోజకవర్గ కుటుంబసభ్యుల ప్రేమాభిమానాలు మా కుటుంబంపై ఉన్నాయన్నారు. నాన్న మాపై ఉంచిన బాధ్యత సర్వేపల్లి నియోజకవర్గ ప్రజలను కంటికిరెప్పలా కాపాడుకోవడం జరుగుతుందన్నారు. అక్రమ కేసులు పెట్టి జైళ్లకు పంపి, మాకు అన్యాయం చేశారని సర్వేపల్లి ప్రజలు అండగా నిలుస్తున్నారని తెలిపారు. సర్వేపల్లి నియోజకవర్గంలో ఎక్కడికి వెళ్లినా ప్రజలునాన్నపై ఉన్న అభిమానం, ఆప్యాయతను నాపై చూపిస్తున్నారని తెలిపారు. నాన్నను తమ నాయకుడిగా కాకుండా, తమ కుటుంబసభ్యుడిగా నియోజకవర్గం లోని ప్రజలు అభిమానిస్తున్నారు అని తెలిపారు. తమ కుటుంబ సభ్యుడు తప్పు చేయదనే భావన సర్వేపల్లి నియోజకవర్గ ప్రజలలో నమ్మకం బలంగా ఉందన్నారు.కూటమి ప్రభుత్వం ఇకనైనా ఇటువంటి కక్షపూరిత చర్యలు ఆపాలని కోరుతున్నామని తెలిపారు. దువ్వూరు విజయభాస్కర్ రెడ్డి తొందరగా కోలుకోవాలని కోరుకుంటున్నామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గంగవరం సుగుణ, జడ్పిటిసి బందుల వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యులు నవీద్ భాషా, నాయకులు దువ్వూరు చంద్రశేఖర్ రెడ్డి, దువ్వూరు విశ్వమోహన్ రెడ్డి, చెంగారెడ్డి, పాముల సీనయ్య, మురళీకృష్ణ, రఘు, భాస్కర్, కరుణాకర్, విజయమ్మ, ఈదురు శ్రీనివాసులరెడ్డి, అశోక్ కుమార్ రెడ్డి, మస్తాన్, దువ్వూరు హరికృష్ణ, సర్పంచులు ప్రతాప్, ఆలపాక సీనయ్య, అన్నా బత్తిన కృష్ణవేణి, మస్తానమ్మ తదితరులు పాల్గొన్నారు.

పుణ్యక్షేత్రాల అభివృద్ధికి ఆర్థిక సాయం అందించండి

టీటీడీని కోరిన ఉదయగిరి అభివృద్ధి ఫోరం

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు: ఉదయగిరి నియోజక వర్గ అభివృద్ధికై తిరుమల తిరుపతి దేవస్థానం ద్వారా ఆర్థిక సహకారం అందించమని ఉదయగిరి అభివృద్ధి ఫోరం టిటిడి చైర్మన్ బీఆర్ నాయుడును కోరింది. ఈ మేరకు ఫోరం ప్రతినిధులు వివిఎస్ఆర్ మూర్తి,ఎం.డి.ఖాజ గురువారం పంపిన ఒక వినతి పత్రంలో కోరారు. నెల్లూరు జిల్లాలోని ఉదయగిరి నియోజకవర్గంఅన్ని రంగాలలో వెనుకబడివుందని, ఇక్కడి వేలాది ఎకరాల వ్యవసాయ భూములు సాగు నీటికి నోచక బంజరు భూములుగా ఉండి పోయాయని అన్నారు. పారిశ్రామికంగా ఎటువంటి అభివృద్ధి ఎరుగని, ఉపాధి అవకాశాలు లేని ఉదయగిరి ప్రాంతంలో ఎక్కువగా వలస కార్మికులు అధికంగా ఉన్నారని తెలిపారు. దశాబ్దాలుగా ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురై జిల్లాలోఅత్యంత వెనుకబడి వున్న ఉదయగిరి నియోజక వర్గ అభివృద్ధి కోసంఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ నెల్లూరు పార్లమెంట్ సభ్యులువేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తమవంతుగా ప్రయత్నిస్తున్నారనితమరినుంచి కూడా సహాయ సహకారం కోరుతున్నామన్నారు. వెనుకబడిన ఉదయగిరి ప్రాంతానికి టిటిడి తరపున చేయూత నందించి, ఇక్కడి పేద బడుగు వర్గాల ప్రజల బ్రతుకులు మెరుగుపర్చుదురని వారు తమ వినతి పత్రంలో కోరారు. నర్రవాడలోని శ్రీ వెంగమాంబ పేరంటాలు ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం టిటిడి వసతి గృహం, సత్రాలు నిర్మించాలని వారు కోరారు. ఉదయగిరిలో కొన్ని దశాబ్దాల క్రితంనిర్మించిన టిటిడి కళ్యాణమండప భవన సముదాయాన్ని ఆధునీకరించి తగిన సౌకర్యాలు కల్పించి వినియోగంలోకి తేవలసిందిగా కోరారు. వింజమూరు పట్టణంలోను, వరికుంటపాడులోను టిటిడి కళ్యాణ మండపాలు నిర్మించ వలసిందిగా కోరారు. ఉదయగిరిని పర్యాటక ప్రదేశంగా అభివృద్ధి పర్చేందుకు ఉదయగిరిలోని విజయనగర రాజుల కాలంనాటిసుప్రసిద్ధ శ్రీరంగనాయకుల స్వామి ఆలయాన్ని, కళ్యాణమండపాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఈ ప్రాంతంలోని నల్లగొండ్ల, సిద్దేశ్వరం, భైరవకోన ఆలయాలకు టిటిడి ఆర్థిక సహాయం అందించి అభివృద్ధి చేయాలని కోరారు. తద్వారా చారిత్రక ప్రసిద్ధి చెందిన ఉదయగిరికి తగిన గుర్తింపు లభిస్తుందని, ఉదయగిరి ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందుతుందన్నారు. దీనివలన నర్రవాడ శ్రీ వెంగమాంబ దేవస్థానం, ఉదయగిరి శ్రీ రంగనాయకుల స్వామి చారిత్రక ఆలయం, ఘటిక సిద్దేశ్వరం, భైరవకోనలోని శివాలయాలకు ప్రాచుర్యం లభిస్తుందని అభిప్రాయపడ్డారు. ఉదయగిరిలాంటి వెనుకబడిన ప్రాంతంలోని పుణ్యక్షేత్రాల అభివృద్ధికి టిటిడి ఆర్థిక సహాయం అందించాలని వారు కోరారు.

అంగన్వాడీల్లో అక్షరాభ్యాసం

విశాలాంధ్ర-ముత్తుకూరు: అంగన్వాడీ కేంద్రాల్లో గురువారం అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించినట్లు ఐసిడిఎస్ సూపర్వైజర్ అమ్మనమ్మ తెలిపారు. గురువారం మండలంలోని బలిజ పాలెం అంగన్వాడీ కేంద్రంలో అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆమె తెలిపారు. పదిమంది పిల్లలతో అంగన్వాడీల్లో అక్షరాభ్యాసం కార్యక్రమంలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడేళ్లు నిండిన ప్రతి ఒక్క పిల్లలను స్థానికంగా ఉండే అంగన్వాడీ కేంద్రాలలో తల్లిదండ్రులు చేర్పించాలని ఆమె సూచించారు. అలాగే ఆటపాటలతో కూడిన విద్యను, పౌష్టికాహారాన్ని పిల్లలకు అంగన్వాడీ కేంద్రంలో ఇవ్వడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్ సుబ్బమ్మ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.